# చీకట్లో వెలుగు

రచన
మాస్టర్ రవి,

ఉమని ఒక సారిచూస్తే మరచి పోలేం జీవితాంతం. ఆ రూపం మన మనోఫలకంపై ముద్ర వేసుకునే వుంటుంది. గుండ్రటి కళ్ళు, ఇటూ అటూ తిప్పుతూ, ఎపుడూ చక చక లాడుతూ మాట్లాడుతూంటే వినాలనే వుంటుందికాని, విసుగనిపించదు.

అసలు ఉమతో నా పరిచయమే విచిత్రమైంది. ఓసారి జనతాలో మద్రాసు పోతున్నాను. జాగాలేక సతమత మౌతూంటే, ఆ భోగీలోకే నేనూ ఎక్కాను. మరేం చేసేది? ట్రైనంతా ఒక్కలాగే ఏడిసిందాయిరి.

ఖరీదయిన దుప్పటి కప్పుకుని ఓవ్యక్తి నిద్రపోతూంటే అది, తలపక్కో, కాళ్ళపక్కో తెలీదు కాని, కాస్త చటికిలపడితే, ఆకాస్తీ కదలకపోతుందా - అని, నా శరీరాన్ని చేరవేశాను. ఆ ముసుగు మనిషి, కప్పు దుప్పటీ అయినా తీయకుండా పొట్టిగా అయి, నా కాస్త జాగా లభింపజేసింది. అక్కడున్నది ఎవరనే ఆకాంక్ష కంటే, జాగా దొరికిందనే సంతోషంతో వూరుకున్నాను.

మెల్లగా నాకు నిద్ర ఆవహించింది. జోగుతూ, జోగుతూ ఒక్కసారి ఆ ముసుగు మనిషిపై ఒరిగి పోయాను. అవ్యక్తి తృళ్ళిపడి లేచి నా వంకఅశ్చర్యంగా చూసే సరికి, నేనూ బిత్తర పోయ 'సారి...' అన్నాను తప్పు చేసిన వాళ్ళా.

'నెవ్వర్ మైండ్..............కమాన్ ... సిట్ కంఫర్ట్బ్లీ...' అంటూ ఎర్రగావున్న కళ్ళు తిప్పుతూ మాట్లాడే సరికి అంత నిద్రా ఎటో ఎగిరి పోయిందినాకు.

అతనే ఉమ. అంటే ఉమాపతిరావు.

విచిత్రంగా నవ్వుతూ నవ్విస్తూ ఎపుడూ మనుష్యుల్ని లొజాగా వుంచటం అతని హాబీ.

'ఎంతవరకు?' అన్నాడు ఉమ.

'మద్రాసు'...

'ఐసీ...ఐటూ...'

'దట్స్ గుడ్...ఎవరింటికి?' అడిగాను.

'అదేం ఖర్మండీ బాబూ ... ఎవరింటికో నేనెందుకెళ్తాను? మా ఇంటికేనండి...ఇపుడే దేశాటన ముగించుకుని, స్వరాజ్య పట్టాభిషక్తున్నయ్యే నిమిత్తం పోతున్నాను. అడక్కుండానే అన్నీ చెప్పడం, అడిగి అన్నీ తెలుసుకోవడం మన హాబీ. నా పూర్తిపేరు కలువనోము ఉమాపతిరావు. బియస్సీ ఎగ్రికల్చర్ - ఊరు మద్రాసు. చదవటం ఆంధ్రదేశంలో. ఇక మీ గురించిచెప్పండి...' దడ దడ చెప్పి ఆగిపోయాడు.

నా గూర్చి వివరాలు చెప్పాను.

అతను ఆశ్చర్యపోతూ మీరేనా '—' అంటే, మీ రచనలు చాల చదివాను. మా కాలేజీలో మీకథలన్నా గేయాలన్నా పడి ఛస్తారు, అందులా మారజనికి మరీను, మీ నవల మార్కెట్ లోకి వస్తే చాలు ముందుతను కొని చదవాల్సిందే. అబ్బ! మరీ అంత పిచ్చి కూడదుస్మండి. ఇక ఆ రోజంతా సాహిత్యం గూర్చి. అలాంటి నాకు సాహిత్యమంటే అయిష్ట మనుకునేరు. ఇష్టమే గాని పిచ్చి లేదు...

ఒక నిమిషం నిశ్శబ్దంగా గడిచేక 'రజని చాల బావుంటుంది...' అని ఆగిపోయాడు. నేనేమీ అన లేదు......అతనూ వూరుకున్నాడు. నా నిశ్శబ్దానికి అతనే మనుకున్నాడో ఏటోగాని మరేమీ మాట్లాడక 'ఈవ్స్ వీక్లీ' తిరిగేసి అది పూర్తయాక, బ్యాగ్ తిరిగేసి ఓ ఆల్బం తెరిచాడు.

మొదటి పేజీలో రెండు జడలు, నిండైన ముఖం; చిన్న చిరునవ్వు, యువకులను కాపించగలిగే గుండ్రటి కళ్ళు, విశాలమైన నుదురు, దాని మధ్యన, ముఖానికి దిష్టితగలకుండా ఉందేందుకేమో ఓ బొట్టు చాల బావుందా అమ్మాయి.

'సూపర్బ్...బ్యూటీ......' అనేశాను పైకి. ఉమనా వేపు ఆశక్తిగా చూశాడు...

'ఈజ్ షి సో బ్యూటిఫుల్......' అన్నాడు.

'వున్నదానికి అబద్ధం చెప్పడ మెందుకండీ...ఇంతకీ మీరు అదృష్టవంతులు. ఇలాంటి వాళ్ళు నా సాహిత్యాన్ని మెచ్చుకుంటున్నారంటే, నాకెంతో ఆనందంగావుంది......రజని మీ క్లాస్ మేటా ?...'

'అవును రజని నా క్లాస్ మేట్ ఇపుడు కాదు. పియూసీ చదువు తున్నప్పుడు. ఇపుడు ఇంకొకరి అర్ధాంగి గాద్గదికంగా ఆగిపోయాడు.

నాకు చాలా బాధకలిగింది అతనిహృదయాన్ని గాయపరచానేమో అని ఫీలయాను.

“ఓ... ను ఉత్తేజ పరచాలన్నా, నాశనం చేయాలన్నా, ఆడవాళ్ళ చేతుల్లోనే ఉంది. రజనిగూర్చి నే నెన్నో తీయని తలపులు తలపోశాను. కానీ, రజని నానుండి శాశ్వతంగా దూరమై పోయింది. తనదంటూ నాదగ్గరేం వుండకుండా, ఆఖరికి తనిచ్చిన ఫోటో కూడా తీసుకుంది... హుఁ... రజని...” ఆగిపోయాడు. నేను తృళ్ళిపడ్డాను. రజని ఫోటో లేదంటాడేమిటి? ఇంత బ్రహ్మాండమైన ఫోటో ఎదురుగా వుంచుకుని......అనుమానంతో అడిగేశాను.

‘ఇది రజనిది కాదు......నా చెల్లెలు జానకిది...’ ఆగిపోయాడు ఉమ.

నేను స్థంభించిపోయాను.

ఉమ విచిత్ర ప్రవర్తన అర్థం చేసుకోవడం కాస్త కష్టమైనపనే.

‘......నేను రెస్టు తీసుకుందామనుకుంటున్నాను. తెల్లవారేక మాట్లాడుకుందాం...’ అంటూ ఉమ తిరిగి ముసుగు తన్నేడు.

నేనేం అనలేదు.

* * *

తెల తెల వారుతుండగా ఉమ లేచాడు. నేనూ కాస్త కునికానుగానీ, నిద్ర సరిగా పట్టలేదు, బ్రెష్ చేసుకుని వచ్చి, బేగ్ తెరిచి బోర్న్‌విటా గ్లాసులో వేసుకుని ఇంజను వద్దకు వెళ్ళి వేణ్ణీళ్ళు తెచ్చి, కలిపి నాక్కాస్త ఇచ్చాడు. ఈలోగా నేనూ బ్రెష్ చేసుకుని రడీగా వున్నాను. బోర్న్‌విటా కాస్త గొంతులోకి పోనీ—.

‘...మీరు చాలా కన్‌ఫ్యూజ్ అయారు కదూ... రజని...జానకి... హుఁ నన్నుగూర్చి కూడ మీరు విచిత్రంగా అనుకోవచ్చు...ఏమిటో నా సంగతి నాకే తెలీటంలేదు వింటున్నాను.

‘......రజని నాలో ఆశలు రేపింది. జీవితంలోని తీయందనాల లోతులలోకి నన్ను లాక్కెళ్ళింది. నేనూ నమ్మేను. రజని రూపంతో నా హృదయం నింపుకున్నాను. ప్రతి నిమిషం రజనిని నా ఆశారేఖగా ఎంచి ఆరాధించాను. రజని కూడ నన్ను పూర్తిగా నమ్మింది. కానీ...అలాంటి రజని నా సంగతే పూర్తిగా ఎందుకు విస్మరించిందో మరి ముందు నాలో ఎందు కలాంటి భావాలు మొలకరెత్తించిందో...ఏమిటో...ఓరోజు... శుభలేఖ వచ్చింది. విప్పి చూశాను. రజని పేరు ప్రక్కన ఎవరో రంగారావు పేరువుంది...ఎవరి పేరుంటే నాకేం? రజనిలో ఇక నాకు స్థానంలేదు. రజని పరాయిది. పోన్లెండి. రజని నన్ను విస్మరించినా నేను మాత్రం ఆమెను గౌరవిస్తూంటాను’ ఉమ ఆగిపోయాడు.

ఎర్రగా గాయంలావున్న ఉమ కళ్ళు అశ్రుపూరితాలైనాయి. రజని గూర్చి అతనుపొందే మనోవ్యథ నాకర్థమైంది...రజని ఎందుకలా చేసిందో అనవసరం. భారతదేశంలో ఆడవాళ్ళకు హృదయాలలో ఆరాధించడం తెలుసుగాని, హృదయం విప్పి ప్రవర్తించడం చేతకాదు. అంచేత వారు వంచింపబడి, ఇంకొన్ని బాధలకు గురిచేస్తారు. ఇది తర తరాలుగా వస్తున్నతత్వం. ఇది మారదు మారడమూ కష్టమే.

‘సర్లెండి, నా గొడవకేం గాని...మీరు మద్రాసులో ఎక్కడ వుంటారు?...’ అను రాగంగా ఆగేడు ఉమ.

‘మాకసిన్ ఇంజనీరింగు చదువుతున్నాడు. ఫైనలియరు. ఓ పత్రిక ఆహ్వానంపై వెళ్తున్నాను. వాడి హాస్టల్లోనే ఓరోజుండి తిరిగి పోతాను.’ అన్నాను.

‘అదేం పనికిరాదు. ముందుమాఇంటికి వచ్చి, విశ్రాంతి తీసుకున్నాక మీ పనిమీద వెల్దురుగాని. అంతవరకూ వదిలేదిలేదు. పట్టుబట్టాడు ఉమ. ‘సరే’ ననక తప్పలేదు.

* * *

ఉమ బంగళా చాల అదునాతనంగావుంది. టాక్సీని పంపించేసి గబగబ లోనికినడిచి, తాళం వేసున్న తలుపు చూసి, ఆగిపోయి...’ జానకి ఎటు వెళ్ళుంటుంది చెప్మా’ అనుకుంటూ తాళంకోసం కిటికీ వెతికాడు. అక్కడున్న తాళం అందుకుంటూ—

‘చూశారా! మా చెల్లెమ్మ ఎంత తెలివైందో, ఏవేళలో నేను వస్తానో అని పాపం తాళం ఇక్కడేవుంచి ఎటో వెళ్ళింది. పిచ్చిపిల్ల. జానకి చురుకైనపిల్ల. దానికి మంచి సంబంధంచూసి పెళ్ళిచేసేస్తే నా బాధ్యత తీరిపోతుంది. అమ్మా నాన్నా పోతూ ఈభారం నాపై వుంచారు. జానకిని పంపించి, రజనిని తెచ్చుకుందా మనుకున్నాను. కానీ...’ తలుపుతీసి లోనికి వెళ్ళాడు ఉమ. నేనూ అనుసరించాను.

టేబిలు మీదఉన్న టపాల్స్ చూస్తూ అందులో ఓకవరు విప్పి, ఆత్రంగా చదివి...జానకీ ఎంత పన్చే శావ్ జానకీ...నా దగ్గర నీకు దాపరిక మెందుకు తల్లీ' అని, ఆ ఉత్తరాన్ని నా మీదకు విసిరాడు ఉమ. నేను తీసి చదివాను.

అన్నయ్యా!

ఆడవాళ్ళు మనసులో భావాలు మనస్సుల్లోనే వుంచుకోగలరు గాని, ఎంత దగ్గర వారైనా మనసువిప్పి చెప్పుకోలేరు. అది వారి బలహీనత. తీరా వారు మనసు విప్పి మాటాడితే ఇతరలవాళ్ళు సరిగా అర్థం చేసుకుంటారు గనుక నా? ఇంత మిడిసిపాటేమిటి?...' అంటారు గాని హృదయాలను గ్రహించరు. నేను భాస్కరాన్ని హృదయ పూర్వకంగా ప్రేమించాను. అతనూ అంతే. ఈ సంగతి నీతో చెప్దామనుకున్నాను. కానీ ఆ ధైర్యం లేక పోయింది. అందులోనూ అతను వేరే కులస్తుడు. ఆదర్శాలు చెప్పడం సులభంకాని, ఆచరించడం కష్టం కదా! అంచేత భయపడ్డాను. నువ్వు నన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తావని తలుస్తాను.

అతనూ నేనూ త్వరలో నిన్నుకలుస్తాము ఆశీర్వదించు.

ఇట్లు
జానకి

అతన్ని వూరదించడం చాల కష్టమైంది. 'ఆడవాళ్లు ఎప్పుడూ ఇంతే. ఎవరూ తమని అర్థం చేసుకోరనే బాధ పడతారుగాని, తమ బాధని, ఇష్టాన్నివ్యక్తం చేసుకోలేక పోయామే—అని మాత్రం విచారించరు. ఇదివాళ్ళ తత్వం. ఇది మారడం కష్టం. 'ప్రేమ' విఫలమైతే మనిషి పొందే మనఃక్లేశం నాకు తెలుసు. జానకి ఒక్క మాట - మాట వరసకనివుంటే, ఆవతలివ్యక్తి ఎవరైనా సరే 'సరే' నందునే. హృదయ పూర్వకంగా ప్రేమించుకున్న వాళ్లను కలపడంకన్న మంచిపని ఇంకేవుంది...ఎలా అయితేనేం జానకి తొందర పడింది. రజని, జానకి-ఇద్దరూ నాకు గాయాలు తగిలించారు...' బాధపడ్డాడు ఉమ.

నా పని ముగించుకుని, హాస్టల్‌కు వెళ్ళాను. మా వాడు మొన్ననే వెళ్ళిపోయినట్టు తెలిసి, ఉమ వద్ద శలవు తీసుకుని మా వూరు వెళ్దామని బంగళాకు వెళ్ళాను. ఉమ చాల నైరాశ్యంగా, వెర్రి[illegible] కూర్చున్నాడు. 'కాస్త మనశ్శాంతి కలుగుతుంది. నాతోపాటు మా వూరు రండి. ఒక వారం వుండి వెళ్దురుగాని...' అని ఎంతో బ్రతిమాలిన మీదట సరేనన్నాడు. ఇద్దరం బయలుదేరాం.

* * *

మా ఇంటిముందు ఆగిన రిక్షాలోంచి దిగి, తలుపు తట్టాను. నా వెనుక ఉమ నిల్చున్నాడు. రెండు నిముషాల్లో తలుపులు తెరుచుకున్నాయి. తలుపులు తెరచిన అమ్మాయి వేపు నేనాశ్చర్యంగా చూస్తుంటే, ఉమ ఆత్రంగా '—జానకీ...' అన్నాడు,

అపుడే వీధిలోంచి వచ్చిన మా కసిన్ భాస్కరం ఇది చూసి 'క్షమించ' మన్నట్టుగా బుర్రవంచుకున్నాడు.



విఠల్ ప్రొడక్షన్స్‌వారి 'గురువునుమించిన శిష్యులో'
కాంతారావు—కృష్ణకుమారి.